క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

16 మంది నిరాశ్రయులకు ఆశ్రయం



వసతి గృహానికి తరలించిన నిరాశ్రయులు

అల్లిపురం : ఏయూటీడీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో 16 మంది నిరాశ్రయులను గుర్తించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో బిచ్చమెత్తుకుంటూ, రోజుల తరబడి అక్కడే తిష్ట వేసుకుని ఉంటున్న వారందరికీ టీఎస్ఆర్ కాంప్లెక్స్, మెన్ అండ్ ఉమెన్ షెల్టర్లలో ఆశ్రయం కల్పించారు. వారిలో 13 మంది మగవాళ్లు, ముగ్గురు మహిళలు ఉన్నారు. భిక్షాటనకు అలవాటు పడి వీళ్లలో కొంత మంది బయటికి వెళ్లిపోతామని గొడవ చేయటంతో, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి యాచక వృత్తి నుంచి దూరం చేసే ప్రయత్నం జరుగుతుందని ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు.

ఉత్సాహంగా పుస్తక పఠనం



విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి నూకరాజు

అల్లిపురం : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో చిన్నారులు వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. దీంట్లో భాగంగా స్వాతంత్ర సమర యోధుల జీవిత చరిత్రల గురించి గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు విద్యార్థులతో చదివించి వినిపించారు. వారిని ఆదర్శంగా తీసుకుని సమాజ ఉద్ధరణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఆసక్తిగా ప్రముఖుల జీవిత చరిత్రలు తెలుసుకున్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్ : టీపీటీ కాలనీ వద్ద గల పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున శుక్రవారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14వ వార్డు పరిధిలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, 16వ వార్డు పరిధి కేఆర్ఎంకాలనీ, భానూనగర్, 24వ వార్డు పరిధి టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా మంచినీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేయనుందని చెప్పారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆదరణ కరవు.. బతుకు బరువు



మండుటెండలో అవస్థలు పడుతున్న స్వర్ణకారుడు

- మండుటెండలోనూ పండుటాకులకు తప్పని బతుకు పోరు
- ఏ పూట కష్టపడితే.. ఆ పూటే సాపాటు

డాబాగార్డెన్స్ : నెత్తిన సూరీడు మండిపోతున్నాడు. పక్షం రోజులుగా ఎండ తీవ్రత తారాస్థాయికి చేరింది. బయటికొస్తే నిప్పుల కొలిమి.. ఇంట్లో ఉంటే ఊపిరాడదు.. ఇలాంటి పరిస్థితిలో పలువురు కార్మికులు, తోపుడు బళ్ల వ్యాపారులు, కూలీలు బతుకు బండి లాగేందుకు ఎండలోనే పనులు చేస్తున్నారు. ఇక రోజువారీ కూలీలు, రిక్షా కార్మికులు, పారిశుధ్య సిబ్బంది, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, చిల్లర వర్తకులంతా భగభగ మండే ఎండలోనే పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కష్టపడకపోతే వీరికి పూట గడవదు. దీని కోసం ఎంతటి ఎండనైనా లెక్క చేయకుండా పనులు చేస్తున్నారు. శేష జీవితం హాయిగా కుటుంబ సభ్యుల మధ్య గడపాల్సిన వయసులో ఒంటరిగా బతుకు బండి లాగేందుకు కష్టపడుతున్నారు.

గిరాకీ ఉంటేనే కడుపు నిండుతుంది..



నా పేరు సూరిబాబు. పెదవాల్తేరులో ఉంటాను. నా వయసు 80 ఏళ్లు. నాకు ఎవరూ లేరు. ఉదయం నుంచి ఏదో ఓ చెట్టుకి నేను అల్లిన ఊయలలు కట్టి ఇలా విక్రయిస్తుంటాను. ఇవి అమ్ముడుపోతేనే ఆ పూటకు నా పొట్ట నిండుతుంది. లేదంటే పస్తులే. నా వెనుక ఎవరూ లేరు. అప్పుడప్పుడు ఎంతో ఆవేదనకు గురవుతుంటాను. కానీ చెట్టుకు కట్టిన ఊయల ఊగుతూ అలా కష్టాలు మరచిపోతుంటాను. ఎవరైనా ఊయల కొంటే నాకు ఎంతో ఆనందం. నేను పడిన కష్టానికి డబ్బులొస్తే చాలు. నా జానెడు పొట్ట నింపుకోవడానికి వేలకు వేలు అక్కర్లేదు.

పది కుటుంబాలకు ఉపాధి కల్పించాను..

నా పేరు లక్ష్మమ్మ. వన్‌టౌన్‌లో ఉంటాను. నా వయసు 85 ఏళ్లు. భర్త చనిపోయాడు. మా అమ్మగారి ఊరు కొండకర్ల. అత్తారిల్లు పాతనగరంలోని చెంగల్రావుపేట. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశాను. కొడుకు ఆటో డ్రైవర్. కోడలు చనిపోయింది. పిల్లలతోనే కొడుకు బతుకు బండి ఈడుస్తున్నాడు. కూతురు కూడా చనిపోయింది. ఆమె భర్త ఉన్నాడు. వారి ఆదాయం అంతంతమాత్రమే. మనవడి వద్ద ఉంటున్నాను. ఉదయం సెనక్కాయలు వేపుతాను. కాస్త గెంజన్నం తిని సెనక్కాయలు పట్టుకుని రోడ్డెక్కుతాను. సాయంత్రం పొద్దు పోయే వరకు వీటిని అమ్ముతాను. ఇంటికి వచ్చి ముద్ద తిని పడుకుంటాను. మాకు బేకరీ ఉండేది. మేమే 10 కుటుంబాలకు ఉపాధి కల్పించేవారం. ప్రస్తుతం నా పరిస్థితి ఇలా మారింది. రోడ్డున పడ్డాను. 85 ఏళ్ల వయస్సులో మండుటెండల్లో కూడా బతుకు బండి సాగిస్తున్నాను.



పలు ఆలయాల్లో వాసుపల్లి పూజలు



కనకమహాలక్ష్మికి అభిషేకం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ దంపతులు

డాబాగార్డెన్స్ : వైశాఖ బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, ఉషారాణి దంపతులు గురువారం పలు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. పౌర్ణమి విశిష్టత గల ఇసుకకొండ (బాబా జీకొండ) రమా సహిత సత్యనారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం పొందారు. 34వ వార్డులోని సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సాయినాథుని ఆలయంలో వాసుపల్లి దంపతులు



సత్యదేవుని సన్నిధిలో..

పార్టీ నాయకుడికి వాసుపల్లి పరామర్శ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబులు శ్రీను అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబులు శ్రీను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ధైర్యమిచ్చారు. పెరాలసిస్ రావడంతో చేతులు, కాళ్లు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్న బాబులు శ్రీనుకు ధైర్యం చెప్పి, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. వాసుపల్లితో పాటు 32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బాబులు శ్రీనును పరామర్శిస్తున్న వాసుపల్లి

ఘనంగా మన్యుసూక్త హోమం

మహారాణిపేట : మెయిన్ రోడ్డులో వేంచేసిన శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి ఈ హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోమం వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహ దోష శాంతి చేకూరుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూ. 516 చెల్లించి భక్తులు పాల్గొన్నారు. హోమానంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

5 శాతం సేవలు ఉచితంగా అందజేయాలి

మహారాణిపేట : అన్ని స్కానింగ్ కేంద్రాల్లో 5 శాతం మంది పేదలకు ఉచిత సేవలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆ వివరాలు ఎప్పటికప్పుడు తమకు అందజేయాలన్నారు. సంబంధిత అధికారులతో పకడ్బందీగా డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు. పురుషులతో సమానంగా స్త్రీల నిష్పత్తి పెంచాలని కోరారు. కేజీహెచ్ పిల్లల వైద్యుడు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ 5 శాతం ఉచిత స్కానింగ్ సేవలు అర్హులైన పేదలకు అందుతున్నదీ లేనిదీ తనిఖీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీశ్వరరావు, దిశ సీఐ జి.మల్లేశ్వరి, జీవీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఎన్జీవోలు సన్యాసిరాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఉక్కు కార్మికులపై రోజుకో గుదిబండ

- పోరాట కమిటీ నాయకుల ఆగ్రహం
- 1197వ రోజుకు రిలే దీక్షలు

అగనంపూడి: ఉక్కు కార్మికులపై యాజమాన్యం రోజుకో గుదిబండ మోపుతోందని విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలోని ముఖద్వారం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారానికి 1197వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఓపక్క కర్మాగారాన్ని హోల్‌సేల్‌గా అమ్మేయడానికి కుతంత్రాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఉక్కు ఉన్నతాధికారులు, కార్మికులు నివాసముంటున్న క్వార్టర్స్ విద్యుత్ చార్జీలను రెట్టింపు చేయడం అన్యాయమన్నారు. పెంచిన చార్జీలు వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. కార్మికులను రోజుకో విధంగా ఇబ్బంది పాల్జేయాలని చూస్తున్నారని, ఓపక్క జీతాలు చెల్లించకుండా మరోపక్క అదనపు భారం మోపడానికి యాజమాన్యం ప్రయత్నించడం దారుణమన్నారు. పోరాట కమిటీ నాయకులు డీసీహెచ్. వెంకటేశ్వరరావు, సుబ్బయ్య, డొక్కా నరసింహారావు మాట్లాడుతూ 2017 నుంచి వేతనాల సవరణ చేయకుండా కార్మికులను ఆర్థికంగా దెబ్బతీస్తున్న యాజమాన్యం, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు రోజుకో డ్రామాకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు, కె.వెంకటరావు, రమణమూర్తి, మహిళా నేత ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

తాటిచెట్లపాలెం: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. వైశాఖి పౌర్ణమి సందర్భంగా గురువారం రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో నిర్వహించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని సీతారాం దంపతులు ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ముందుగా వారు ధ్యాన మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కొన్నేళ్లుగా ధ్యాన మందిరంలో అకుంఠిత దీక్ష, క్రమశిక్షణతో నిత్యం అన్నదానం, మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని, మందిర కమిటీ సభ్యులను అభినందించారు. సుమారు 400 మందికి ప్రత్యేక వంటకాలతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న గొండు సీతారాం దంపతులు

కమనీయం.. కల్యాణోత్సవం

- బల్లిగిరిలో ముగిసిన ఉత్సవాలు
- వైభవంగా సహస్ర ఘటాభిషేకం, చక్రస్నానం
- భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



చక్రతీర్థ స్నానానికి సిద్ధంగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న ఉత్సవ విగ్రహాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు



పాలు, పెరుగు, జలాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక స్వాములు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈనెల 18వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి వీరరాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. ముందుగా పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి భక్తి శ్రద్ధలతో చక్రస్నానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని ఆమె కోరారు.

బుద్ధునికి పూజలు



బుద్ధుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్ : బుద్ధ పూర్ణిమ సందర్భంగా జీవీఎంసీ 37వ వార్డులో గల బుద్ధుని విగ్రహం వద్ద రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూజలు జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, కల్యాణ్ ముని, చిన్నారెడ్డి, చిన్ని, నందు, భాస్కర్, కస్తూరి వెంకట్రావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చిన్నారులకు మేలు

మల్కాపురం: చిన్నారులకు తల్లిదండ్రులు నిత్యం పౌష్టికాహారాన్ని అందించాలని, తద్వారా వారు ఆరోగ్యవంతులుగా నిలుస్తారని ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు చిత్రలేఖనం, పలు వ్యర్థాలతో కళాకృతుల తయారీలో శిక్షణ ఇచ్చారు. అతిథులు పలు సూచనలు చేశారు.

జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత

ఏయూ క్యాంపస్: జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్ తెలిపారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఒక రోజు జాతీయ సదస్సు ఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ ఎకో టూరిజం ఆన్ బయోడైవర్సిటీ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారం పెరగడం పెను ముప్పుకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రణాళికాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతీ వ్యక్తి మారాల్సిన అవసరం ఉందన్నారు. సర్వప్రాణి సేవ భగవంతుని సేవగా నిలుస్తుందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర జీవులపై సైతం ప్రభావం చూపుతోందన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్ సభ్యుడు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం, పర్యవసనాలను వివరించారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావం జీడీపీపై ప్రభావం చూపుతుందన్నారు. పర్యాటకం పేరుతో జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే దారి ప్రభావం ప్రతీ జీవిపైన పడుతుందన్నారు. అనంతరం అతిథులను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య కె.సంధ్య దీపిక, పలు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జానకీరామ్

సాయి మందిరానికి వెండి వస్తువుల వితరణ

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయానికి స్థానిక భక్తుడు వెండి పంచహారతి స్టాండ్‌ను బహూకరించారు. వైశాఖ మాసం సందర్భంగా బాబా మందిరంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పలువురు భక్తులు పాల్గొని, హారతి ఇచ్చారు. మధ్యాహ్నం బాబా మందిరం వద్ద రెండు వందల మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.



బాబాకు వెండి పంచహారతి స్టాండ్ సమర్పిస్తున్న భక్తులు